

# ప్రియబాంధవి

## అక్కల్ల సరస్వతి బాబూరావు

మూడునాలుగు డిగ్రీల జ్వరంతో బాధపడుతున్న నాకు కాలింగ్‌బెల్ రెండవసారి మరింతగట్టిగా మ్రోగటంతో వళ్ళు మండింది. లేచి విసుగ్గా తలుపుతీసి "ఎవరూ?" అన్నాను చిరాగ్గా. గుమ్మం అవతలగా నిలబడ్డ అపరిచిత వ్యక్తిని ఒక్కక్షణం పరీక్షించి చూశాను. ఆయాసంతో దీర్ఘంగా కనిపించిన ఆ వ్యక్తి మానసికాందోళన చెందుతున్నట్లు అనిపించింది.

"వారు ఇంట్లోలేరు" అన్నాను ఆయన కోసం వచ్చాడని. కానీ అతడు నా మాట వినిపించుకోకుండా

"మనోరమదర్శన్ మీరేనా?" అన్నాడు.

"అవును"

"నేను లలిత భర్తనండీ" అంటూ గబగబా జేబులోనుండి లలిత ఫోటోతీసి చూపించాడు.

నేను అర్థంకానట్లు చూశాను.

"మీకు నన్ను గుర్తుపట్టడం కోసం ఈ ఫోటో తెచ్చాను. మీతో కొంచెం మాట్లాడాలి"

"నాతో ఏం మాట్లాడుతారు?" కొంచెం భయపడుతూ అడిగాను.

అలా అడగటానికి కూడ కారణం వుంది. ఎందుకంటే లలిత తన భర్త గురించి చెప్పిన విషయాలు నన్నిలా అడిగేటట్లు చేసాయి.

"ఒక్క అయిదు నిముషాలు చాలండీ!" అన్నాడు మళ్ళీ!

ఎందరినో ఆదరంగా ఆహ్వానించే నేను ఆ రోజు అతడిని మనస్ఫూర్తిగా ఇంట్లోకి ఆహ్వానించలేకపోయాను. జ్వరంతో నిలబడలేని స్థితిలో వున్న నేను అలాగే గుమ్మంలో నీర్సంగా తలుపుకు ఆనుకొని చెప్పమన్నట్లు చూశాను.

"నిన్న సాయంకాలం లలిత మీ ఇంటికి వచ్చిందా?"

"వచ్చింది"

"వెంట సునంద కూడ వుందా?"

"ఉంది"

"వాళ్ళెంతసేపటి వరకూ యిక్కడ వున్నారు?"

నాలో సహనం నశించింది. లేకపోతే డిటెక్టివ్‌లాగ ఏమిటీ ప్రశ్నలు!

అయినా శాంతం వహించాను.

"మీరీ ప్రశ్నలన్నీ యెందుకడుగుతున్నారో తెలిసికోవచ్చా?"

"మరేం లేదు. రాత్రి లలిత ఒక పాకెట్ తెచ్చింది. అదిగాని మీ యింట్లో వదిలిందేమో తీసుకెళ్దామని వచ్చాను"

నాకు ఆ పాకెట్‌లో విలువైన నగగాని ఉందేమోననే సందేహం వచ్చింది. లలిత తరుచు నగలకొట్టుకు వెళ్ళడం, కొత్తవి కొనడం, పాతవి మార్చి కొత్తవి తెచ్చుకోడం నాకు తెలుసు!

"ఆమె పాకెట్‌తో మా యింటికి వచ్చిన మాట నిజమే. కాని అది మళ్ళీ ఆమెతోనే తీసుకెళ్ళింది."

"అయితే సరేలెండి. నేను దానికోసమే వచ్చాను. ఇక వెళ్తాను" అంటూ కదిలాడు.

ఇంతసేపు అతడిని అలానిలబెట్టి మాట్లాడినందుకు నా మనస్సు బాధపడినా, అతడిని అలాగే మర్యాద చేయాలని అనుకొన్నాను కసిగా.

ఆ సాయంత్రానికి జ్వరం కొంచెం తగ్గింది. వరండాలో పడక కుర్చీలో పడుకొని ఆకాశంలోని వెండి మబ్బుల్ని చూస్తున్నాను. ఆఫీసునుండి వచ్చిన మావారు నా నుదుటిపై చేయివేసి చూసి, ఆప్యాయంగ నవ్వారు. తర్వాత బట్టలు మార్చుకొని టీ త్రాగుతూ నాకెదురుగా కూర్చున్నారు.

"ప్రొద్దుట లలిత భర్త మన యింటికి వచ్చాడండీ."

మావారు జ్ఞాపకం తెచ్చుకొంటూ,

"కథలు వ్రాస్తుంది, ఆ లలితే కదూ! ఊ. ఏమిటి విశేషం?" అన్నారు.

నేను జరిగింది చెప్పాను. ఆ చెప్పటంలో అతడిని నిలబెట్టి మాట్లాడిన సంగతికూడ దాయలేదు.

రెండు క్షణాలాగి ఆయనన్నారు.

"నువ్వు చేసిన పనేమీ బాగుండలేదు"

నేను ఉలిక్కిపడ్డాను.

"పాపం! అతడు నీకేదో చెప్పాలనో, లేక నీనుండి యేమైనా తెలిసికోవాలనో వచ్చివుంటాడు. నువ్వుచేసిన మర్యాదతో కడుపు నింపుకొని వెళ్ళిపోయి వుంటాడు."

"మీరెన్నయినా చెప్పండి. అతడినిచూస్తే నాకు యెందుకో కసిలాంటి భావం కలిగింది. ఆదరణ చూపాలని, మన్నన చేయాలని అని

పించలేదు. "అవును. నీకెలా అనిపిస్తుంది.. ఏదో కొద్ది పరిచయంతో అతి చనువు పెంచుకొని ఆ లలిత తన యింటి విషయాలు నీకు చెప్పుకొని నీనుండి బండెడు సానుభూతి సంపాదించడమేగాక తన భర్తపట్ల ద్వేషాన్ని కూడ రగిలించుకుపోయింది" నిష్ఠూరంగా అన్నారు.

"ఎంతయినా పురుషులు కదా! పక్షపాతం పోనిచ్చారు కాదు."

"అది కాదు సురేఖా, ఏ ఫిర్యాదులైనా. సమస్యలైనా ఒకవైపునుండి విని నమ్మకూడదు. రెండువైపులా విని ఒక నిర్ణయానికి రావాలి"

"అవును మరి! ఆయన చేతల్లాగ మాటలు కూడ స్థిరంగా వుంటాయి"

"ఐయామ్ సారీ" అని లోపలకు వెళ్ళిపోయాను నేను.

ఆ రాత్రి పడుకొన్న తర్వాత కూడ చాల సేపు ఆలోచించాను. కాని లలితపట్ల అతడి ప్రవర్తనను క్షమించలేకపోయాను.

* * *

మొదటిసారిగ లలితను నేను ఒక రచయితల సమావేశంలో చూశాను. అందంగా, నాజూగ్గా చిన్న వయస్సులోవున్న లలిత అందర్నీ ఆకర్షించగలదు. మరొక రచయిత ద్వారా ఆమె నాకు పరిచయమైంది. ఆమె కలుపుగోలుతనానికి ఆనందం కలిగింది. అలా పరిచయమైన లలితను ఏదో ఫంక్షన్స్‌లో రెండుసార్లు కలిశను. తర్వాత రెండుసార్లు మాయింటికి వచ్చింది. ఎక్కడ కనిపించినా నా దగ్గరకొచ్చి గబగబా కబుర్లు చెప్పేది. రచయితల గురించీ, రచనల గురించీ ఎన్నో మాట్లాడేది. సాధారణంగ నేను "ఆ, ఊ" అనటం తప్ప యేమీ మాట్లాడేదాన్నికాదు.

ఒకరోజు మిట్టమధ్యాహ్నం మా యింటికి వచ్చిన లలితను ఆదరంగ ఆహ్వానించాను. ఆమె చేతిలో ఆమె వ్రాసిన గేయాల సంపుటి వుంది. నేను అవి చదువుతూ కూర్చున్నాను.

ఆమె అద్భుతంగ వ్రాయగలదనిపించింది. కొంచెం ఆగి అన్నాను.

"మీరు బాగా వ్రాస్తారు." ఇంకో రెండు పేజీలు త్రిప్పి ఆమె ముఖంలోకి చూశాను.

నవ్వుతూ కళకళలాడే ఆమె ముఖంలో విషాదచ్ఛాయలు స్పష్టంగా కనిపించినయి.

"అలావున్నారేం?" అన్నాను ఆందోళనగా.

ఏం లేదు. మిమ్ములను చూస్తుంటే అక్కను చూసినట్లువుంది. నా మనసు విప్పి మీముందు పెట్టాలనీ వుంది. ఏమిటో సురేఖగారూ! నాకు జీవితంమీద విసుగు కలుగుతోంది. అందుకే నా ప్రియబాంధవి కోసం యెదురుచూస్తున్నాను. అందుకే 'ప్రియబాంధవీ నను దరిజేర్చుకో' అని పిచ్చిగా పాడుకొంటూవుంటాను."

నేను ఆశ్చర్యంగా ఆమె మాటలు వింటున్నాను.

"నా ప్రియబాంధవి యెవరో తెలుసా?"

తెలియదన్నట్లు తలవూపాను.

"మృత్యుదేవత!" నేను ఉలిక్కిపడ్డాను.

"నీవు చిన్నదానివి! భర్త బిడ్డలు వున్నదానివి. ఈ వయస్సులో నీవిలా మాట్లాడటం న్యాయంగా లేదు. నీవెందుకలా కోరుకొంటున్నావో నాకర్థంకావటం లేదు."

"అవును, యెవరికీ అర్థంగాదు. నాది సలక్షణమైన సంసారమనీ, నాభర్త చదువు, సంస్కారం కలవాడనీ, నేనొక రచయిత్రిననే అందరికీ తెలుసు. కాని ఈ నా రచనలు మీముందు వుంచటానికి నేనుపడే యిబ్బందులు భగవంతుడికి తెలుసు."

"అంటే"

"మీకు యెలా చెప్పను? నాచేత కథలు వ్రాయించటం మానిపించాలని మా వారు యెన్నో ప్రయత్నాలు చేశారు. కాని లాభం లేకపోయింది. అందుకే యిప్పుడేం చేశారో తెలుసా? ఆరు నెలలు ఆఫీసుకు శెలవుపెట్టి నాకు కాపలా కాస్తున్నారు. నాలో చెలరేగే భావాలకు తట్టుకోలేకా, ఆభావాలను కాగితం మీద పెట్టే అవకాశం లేకా నేను అల్లాడిపోతున్నాను. మీరు చెప్పండి, ఇది న్యాయమేనా?"

"అంటే మీవారికి మీరు కథలు వ్రాయటం యిష్టంలేదా?"

"ముమ్మాటికీ యిష్టంలేదు. ఎప్పుడైనా ఒకటీ, అరా వ్రాసిన కాగితాలు ఆయన కంట బడితే అవి కాలి మసికావల్సిందే. అంతేకాదు. నేను క్లబ్బుకు వెళ్ళకూడదు. సినిమాలు చూడకూడదు. నాకు స్నేహితులు వుండకూడదు. స్నానం చేసి నీట్‌గ కనిపించకూడదు. మాసిన బట్టలతో రేగినతలతో ఎంత పిచ్చిగావుంటే అంత ఆనందం ఆయనకు."

'ఎంత పిచ్చిగా వున్నా లలిత అందంగానే వుంటుంది' అనిపించింది నాకు.

"భోజన విషయంలోనూ అంతే. నాకిష్టంలేనివి నన్ను తినమని బలవంత పెడతారు. ఆయనకు ఎలాటి యిబ్బందీ కలగకుండ అన్నీ అమర్చి పెడతాను. పుస్తకాలు చదవకూడదంటే మానివేశాను. సినిమాలు, స్నేహితులూ... అన్నీ మానాను. కాని...రచనలు మానలేకపోతున్నాను. నాకు ప్రాణప్రదమైన వీణను మూలపడేశాను. అందరినీ అలరించే నా సంగీతానికి స్వస్తిచెప్పాను. ఆయనకోసం ఇవన్నీ మానివేశాను. ఒక్క రచనలకే అనుమతించమని ప్రాధేయపడ్డాను. లాభం లేకపోయింది. అందుకే ఏ అర్ధరాత్రో ఆయన


Phones: H.O. 77731
B.O. 86222

Vijayadurga Auto Sales Corporation

H.O. Governorpet, VIJAYAWADA-2 B.O. Jawahar Autonagar, VIJAYAWADA-7

*Suppliers in all kinds of spares for Jeep, Ambassodor, Leyland*
*T. M. B.. Dodge, Bedford J4 & J6 English and American Cars*

OUR SISTER CONCERNS

For all Tractors & Indusrial spares
INDUSTRIAL & AGRICULTURAL Corp.
H. O. Governorpet. Vijayawada-2.
B.O. Jawahar Autonagar, Vijayawada-7

For all Tyres and Tubs :
VIJAYADURGA TYRE CENTER
H.O. Governorpet, Vijayawada-2
B.O. Jawahar Autonagar, Vijayawada-7

నిద్రపోయిన తర్వాత వ్రాసుకొని, చాల జాగ్రత్తగా దాస్తాను."
నేను వింటూ కూర్చున్నాను.
"చూడండి సురేఖా. భార్య అభిలాషలను యింతగా అణగించే నా భర్త నాకు యిష్టంలేని పనులు యెన్నో చేస్తాడు. అయినా నేనేమీ అన కూడదు. ఇప్పుడు చెప్పండి. నన్నేం చేయ మంటారు?"


"చూడు లలితా, నేనిలా అంటున్నానని యేమీ అనుకోవుగదూ. స్త్రీకి భర్త...సంసారం. వీటితర్వాతే యే వ్యాపకమైనా వుండాలి. నీ భర్తకు అంతగ యిష్టంలేని ఆ రచనలు నీవు మానివేస్తే మీ సంసారం సుఖంగా వుంటుంది గదా,"
ఆడవారినుండి మంచి రచనలు రావటం లేదనే విమర్శవున్న ఈ రోజుల్లో చక్కటి రచనలు అందిస్తున్న ఆమెను మానమని చెప్ప టానికి నా మనసు యెదురు తిరిగినా ఆమె భవిష్యత్తుకోసం అలా చెప్పక తప్పలేదు.

"ఆయనకోసం నేనెన్నో వదులుకున్నాను. కాని నాకోసం ఒక్కటి...నా కిష్టంలేని పని ఒక్కటి ఆయన మానారా? లేదే? అలా ఇప్పుడు నాకు ఆనందాన్నిచ్చే ఈ ఒక్క వ్యాపకాన్ని నేను వదులుకోలేను. సహనానికి కూడా ఒక హద్దువుంది సురేఖగారూ."

"అయితే పరిష్కారం నీవే ఆలోచించు కోవాలి" అన్నాను. మనస్సంతా వికలమై పోయింది.
ఆమె వెళ్ళటానికి లేచింది. గేటువరకు నేనూ వెళ్ళాను. రిక్షా యెక్కిన తరువాత,
"ఒకసారి యిలారా లలితా," పిల్చాను.
రిక్షాదిగి నాకు దగ్గరగా వచ్చింది.
"లలితా ఇంతకుముందు చెప్పావే. నీ ప్రియబాంధవి! ఆమెనుమాత్రం యెప్పుడూ ఆహ్వానించకు. నీ పిల్లలను తల్లి లేనివారిగ చేయకు! దేశానికి ఒక మంచి రచయిత్రిని తక్కువ చేయకు. ఎలాంటి పరిస్థితిలోనైనా రచయిత్రిగా నిన్నెప్పుడూ అభిమానిస్తాను. ఈ నాటినుండి నీ 'ప్రియ బాంధవి'ని నేనే!" అన్నాను.
ఆ క్షణంలో ఆమెపై యెనలేని జాలితో పాటు అనురాగంకూడ కలిగింది.

లలిత నా రెండుచేతులూ తన చేతుల్లోకి తీసుకొని కళ్ళకు అద్దుకొంది. తర్వాత నా కళ్ళల్లోకి చూసింది. ఆ కళ్ళనిండా ప్రేమతో పాటు నీళ్ళు నిండుకొన్నాయి.

"మీరెంత మంచివారు! మీలాటి స్నేహితులు నాకు ఒక్కరు చాలు! రచయిత్రిగ




నన్నింత అభిమానించేవారిని మిమ్ములనే చూశాను. కళ్ళు తుడుచుకొంటూ రిక్షా యెక్కింది.
చివరిసారిగ లలిత మా యింటికి వచ్చి నప్పుడు చాల అందంగ అలంకరించుకొంది. పట్టుచీరె, నగలతో నిండుగ వుంది. ఎంతో హుషారుగ వచ్చింది.

"చూశారా, మావారు మీయింటికి రావ టానికి మాత్రం అభ్యంతరం చెప్పటంలేదు. మీ గురించి ఆయన స్నేహితులు గొప్పగ చెప్పారట. మీరంటె ఆయనకెంతో గౌరవం."
"చిత్రంగా వుందే. నన్నొక్కసారి కూడ ఆయన చూడకుండానే!" అన్నాను నవ్వి.
తర్వాత లలితవెళ్తూ హడావిడిగ చాలచెప్పింది.
"నేనీమధ్య చాలా వ్రాశాను, అవన్నీజాగ్రత్త పెట్టలేక సతమత మౌతున్నాను. ఏదో ఒకరోజు అవన్నీ మీకు అందిస్తాను. మీరేం చేసినా సరే" రిక్షాఎక్కి ఈ మాటలంది. నేన లాగే గేట్లో నిలబడి పోయాను, లలితచక్కటి నటి, మంచి గాయకురాలు, రచయిత్రి. రచ యిత్రులు వ్రాయలేరని చెప్పుకొనే నాటకాలు ఆమె వ్రాసింది. వాటికి మంచి పేరూవచ్చింది
రాత్రి చాలా సేపటికిగాని నిద్రరాలేదు.

* * *

సాయంత్రం నాలుగు గంటలకు లలితభర్త మళ్ళీ వచ్చాడు. ఈసారి అతడిని డ్రాయింగ్ రూంలో కూర్చొ బెట్టాను. అతడిలో నిన్నటికి ఈ రోజుకి చాల మార్పు కనిపించింది. మనిషి ఆందోళనగ నీరసంగ కనిపించాడు. కాఫీ అందించాను. త్రాగి కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుని అన్నాడు.
"లలిత నన్నొదిలి వెళ్ళిపోయిందండి" అతని కంఠం దుఃఖంతో పూడుకుపోయింది
ఆశ్చర్యంతో ఏమీ మాట్లాడలేక పోయాను
"ఆమె భర్తగా నన్ను గౌరవించలేదు. అభిమానించలేదు. గృహిణిగా ఏనాడూ ఇంటి బాధ్యత స్వీకరించలేదు. మా పెద్దమ్మాయి పని మనిషిమీద ఇల్లువదిలి తాను క్లబ్బులనీ, రచనలనీ, స్నేహితులనీ తిరుగుతుండేది. రాత్రి ఏపది గంటలకో యిల్లుచేరేది. ఆమె చేసేవన్నీ చూస్తూ భరించాను. ఎందుకంటారు? ఏమైన అంటె పుట్టింటికిపోయి కూర్చుం టుంది. ఆమెను వదిలి నేను ఉండలేను. ఇలా ఎన్నోసార్లు ఆమె వెళ్ళటం, నేను బ్రతిమ లాడటం, ఆమె అన్నలు నచ్చచెప్పి పంపడం జరిగింది, కాని యిప్పుడు అసలే వెళ్ళిపో యింది." అతడు కళ్ళుతుడుచుకుంటూ మళ్ళీ అన్నాడు.

"ఇదంతా ఎందుకు చెపుతున్నానంటె మీరైనా అర్థం చేసుకుంటారని"
"మీరేమీ అనుకోనంటె ఒక విషయం అడగాలని వుంది."
"అడగండి"
"ఆమె మంచి రచయిత్రి. అలాటి వ్యక్తిని వ్రాయొద్దనడం, మీరు నిర్బంధించటం బాగుం దంటారా?"

"నేను వ్రాయొద్దని అనను. చూడండి, నేను ఆఫీసునుండి వచ్చేటప్పటికి యింట్లోవుండదు తొమ్మిది పదిగంటలకు వచ్చి కాగితాలుముందువేసుకొని కూర్చుంటె వ్రాయొద్దన్నాను, సాయంత్రం నుండి ఆమెకోసం యెదురు చూసిననేను ఆమె రాగానే నన్ను ఆప్యాయంగా పలకరించాలని నా ఆనందం తను కూడా పంచుకోవాలనీ కోరుకోటం తప్పంటారా? నేనదే కోరుకున్నాను.

నేనేం మాట్లాడను?

"అయినా ఆమెకు నేనంటె అసలు యిష్టం లేదులెండి. ఆమె అంత అందంగ నేనులేను గదా? అందుకని" మళ్ళీ అతడే అన్నాడు.

అతడి మాటల వలన నేను అర్థం చేసుకోగలిగింది యేమిటంటె ఇద్దరిలో ఎంత మనస్పర్ధలున్నా లలిత లేకుండ అతడు వుండలేడని!

అతడిపట్ల జాలి కలిగింది. లలిత ఎందుకిలా చేసింది? అంత తేలికగా తెంపుకోగలిగే బంధమా వివాహం!

ఆ తరువాత చాలా రోజుల వరకు లలిత భర్త నాకు గుర్తు వస్తూనే వున్నాడు. రెండు నెలల తర్వాత ఒక పత్రికలో కథ చదువుతుంటె ఇది లలిత వ్రాసింది అనిపించింది. కాని ఆ కథ 'కవిత' పేరుతోవుంది. ఆ తర్వాత లలిత స్నేహితురాలు సునందనంగాను. అది లలిత కథేనని తాను వెళ్ళిపోయే ముందుచాలా రచనలు 'కవిత' పేరుతో వ్రాసిందని, అవినాకు అప్పగించాలని ఆఖరిసారి వచ్చిందనీ చెప్పింది.

"మరి నాకేం చెప్పలేదే?" అన్నాను.

"ఆ రోజు మీ ఇంట్లో బంధువులున్నారు. మీరంతా సినిమాకు వెళ్ళే ప్రయత్నములో వున్నారు అందుకే ఆ పాకెట్ మీ కివ్వలేదు. దాని కోసమే మర్రోజు ఆమె భర్త మిమ్మల్నడిగింది."

"ఆయనకెందుకూ?"

"తగలబెట్టడానికి."

ఆ తర్వాత నేనేమీ మాట్లాడలేదు. క్రమంగా లలితను మరచిపోయినాఅప్పుడప్పుడూ గుర్తువస్తూనే వుండేది.

తర్వాత నా శ్రేయోభిలాషులు కొనివారు లలితతో నేనలాస్నేహం చేయడాన్ని హర్షించలేక పోయారు, ఆమె గురించి రకరకాలుగ చెప్పారు. నేనందరికీ ఒకే జవాబు చెప్పాను. "ఆమె వ్యక్తిగత విషయాలు నా కనవసరం. రచయిత్రిగా నామెనభిమానించాను. అంతే" దాంతో మీరెవరూ ఆమె విషయం నాముందు ఎత్తేవారు కాదు.

నాలుగుసంవత్సరాల తర్వాత అన్నయ్య దగ్గరకెళ్ళి వస్తుంటె రైల్లోసునంద కనిపించింది.

"లలిత విషయం ఏమైనా తెలిసిందా అని అడిగాను."

సంవత్సరం తర్వాత కోర్టుద్వారా భర్త నుండి విడాకులు పొందిందని, భర్తమళ్ళీ వివాహం చేసుకొన్నాడనీ, లలిత ఎక్కడుందీ తెలియదనీ చెప్పింది,

కాని నాకీ నాటికీ అనిపిస్తూ వుంటుంది ఏదో ఒకరోజు 'ప్రియ బాంధవీ' అంటూ లలిత నాయింటికి వస్తుందని?


*With the Pongal Compliments :*

Phone : 74065

**Rao's Typewriters Mart**

**Peddibhotlavary St. Governorpet**

**VIJAYAWADA-520002.**

*Agents for :*

HALDA TYPEWRITERS
FACIT CALCULATORS
FACIT ADDING & LISTING MACHINES
SIMPLEXON DUPLICATORS



మిత్రులకు, అభిమానులకు, ఖాతాదారులకు
రిపబ్లిక్ డే శుభాకాంక్షలు

గ్రామ్స్ : "డైమండ్"

ఫోన్స్ : ఆఫీసు 76602 & 76073
హౌసు 76092

**బయ్యాన భీమయ్య & కో.,**

అన్నిరకముల జనపనార వస్తువుల వ్యాపారస్తులు

విజయవాడ-1